క్లుప్తంగా

పీఎస్‌కు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వంశీ



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు విచ్చేశారు. కోర్టు బెయిల్ షరతుల మేరకు ప్రతినెలా రెండవ శనివారం మైనింగ్ కేసులో జరగనున్న విచారణ నిమిత్తం ఆయన హాజరయ్యారు. అనంతరం వంశీమోహన్ పోలీస్ స్టేషన్‌లో సంతకం చేసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు నేతలు, అభిమానులు కలుసుకున్నారు. తొలుత బెయిల్ షరతుల మేరకు వీరవల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆయన సంతకం చేశారు. ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్యనేతలు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కంకిపాడు: దివ్యాంగులు, వృద్ధులను ఆదుకోవాలని వక్తలు సూచించారు. అక్షర యూత్ వెల్ఫేర్ సొసైటీ, గాడ్ హెల్ప్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వజ్రకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ఆపదలో ఉన్న వారికి చేయూత అందించాలని సూచించారు. కార్యక్రమంలో అక్షర సొసైటీ అధ్యక్షుడు కాశిపోగు శివయ్య, గాడ్‌హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు ఎంఎస్‌రాజు, ప్రతినిధులు కె.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు భూమి పూజ



కంకిపాడు: ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. కంకిపాడు పట్టణంలో మండల పరిషత్ నిధులు రూ.23 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ నిధులు సమర్థంగా వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోపాలు తలెత్తకుండా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



పెనమలూరు: వణుకూరు గ్రామం సచివాలయం-1లో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా చేశారు. ఈ సందర్భంగా బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. అనంతరం బాలికలకు పలు ఆటల పోటీలు, డ్యాన్స్‌లు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాస రచనలో కె.లక్ష్మి, డ్రాయింగ్‌లో సీహెచ్.మేఘన, పాటల పోటీలో షేక్ వహిత గెలువగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. బాలికలతోనే సమాజంలో మార్పు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కాళేశ్వరిదేవి, వి.జ్యోతి, కె.శిరీష, కె.శ్రీలేఖ, పి.అనిత,పి.రంగమ్మ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



పుట్టా కీర్తి

గన్నవరం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు గన్నవరం చైతన్య స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారిణి పుట్టా కీర్తి ఎంపికైనట్లు శిక్షకులు ధనియాల నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి డిగ్రీ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించిన కీర్తి కృష్ణా యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో కీర్తి పాల్గొంటుందన్నారు. వీకేఆర్ కళాశాలలో డిగ్రీ పథమ సంవత్సరం చదువుతున్న ఆమెను ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు కీర్తిని అభినందించినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ అక్కసుతో ఆగిన అభివృద్ధి

- ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు
- తుదిదశలో నిలిచిన సచివాలయం, ఆర్‌ఎస్‌కే భవనాలు
- ప్రారంభిస్తే నాలుగు గ్రామాలకు ప్రయోజనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీవ్ర అక్కసు వెళ్లగక్కుతోంది. నిర్మాణాలు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధమైన ప్రభుత్వ భవనాలే దీనికి నిదర్శనం.

విషయం ఇదీ..

కాకులపాడులో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలు కూటమి ప్రభుత్వ తీరును వెక్కిరిస్తున్నాయి. ప్రారంభోత్సవానికి సిద్ధమైన భవనాలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటంలో అధికార పార్టీ నేతలు జాప్యం చేస్తున్న తీరుపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహాత్ముడు కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నిజం చేసే సంకల్పంతో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు అక్కరకు రాకూడదనే దుర్బుద్ధితో ఇప్పుడు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.



తుదిదశ పనులతో నిలిచిన రైతు సేవా కేంద్ర భవనం

తుదిదశలో నిలిచిన పనులు

కాకులపాడు గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో రెండు అంతస్తులతో గ్రామ సచివాలయ భవనం, రూ.21 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికల నాటికే దాదాపు 90 శాతంపైగా ఈ రెండు భవనాల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. టైల్స్, ఎలక్ట్రికల్ వర్క్స్ మాత్రమే మిగిలాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల తదనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఆ భవనాల నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లకు బిల్లు మంజూరు జాప్యం కావటంతో అర్థాంతరంగా పనులు నిలిపివేశారు. దీంతో గత 16 నెలలుగా భవన నిర్మాణ పనులు అలాగే ఆగిపోయాయి.



కాకులపాడులో ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయ భవనం

నాలుగు గ్రామాలకు మేలు

కాకులపాడు గ్రామ సచివాలయం పరిధిలో కాకులపాడుతో పాటుగా దంటగుంట్ల, రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు అందుబాటులోకి వస్తే నాలుగు గ్రామాల ప్రజలు, రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. గ్రామ సచివాలయం భవనం లేకపోవటంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఇరుకు గదుల్లో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయదారులు, కౌలురైతులు అధికంగా ఉండే ఈ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం అందుబాటులో లేకపోవటంతో నానాపాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా ఈ భవనాల తుదిదశ పనులు పూర్తి చేసి ప్రజలు వినియోగించుకునేందుకు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

14న మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రజలు అభిప్రాయాలు తెలపాలని కమిషనర్ షేక్ నజీర్ కోరారు. ఆయన శనివారం మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ రూపొందించటానికి ప్రభుత్వం రెండు ప్రైవేటు సంస్థలకు బాధ్యతలు అప్పగించినట్లు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ తెలిపారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీన పోరంకి ద్వారకా రెసిడెన్సీలో ఉదయం 10.30 గంటలకు అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యావేత్తలు, పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, విలేకరులు పాల్గొని మాస్టర్ ప్లాన్‌కు సబంబంధించి సమాచారం, అభిప్రాయాలు తెలపాలని కమిషర్ నజీర్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం జాతీయ రహదారి సమీప ప్రాంతాలు, వోల్వో షోరూమ్, ఇన్‌ట్యాప్ కంపెనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసే విధంగా కూటమి సర్కార్ కుట్రపన్నుతోందని, దీనిని అందరి మద్దతుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపుతామని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో శనివారం మెడికల్‌కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను రాష్ట్ర పార్టీ కార్యదర్శి, పెనమలూరు, మైలవరం నియోజకవర్గాల పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలతో కలిసి చక్రవర్తి ఆవిష్కరించి ప్రసంగించారు. పేదబడుగు బలహీన వర్గాల ప్రజలు డాక్టర్లు అయ్యే కల చంద్రబాబు దూరం చేస్తున్నారని ఆరోపించారు. పేదవాడికి ఉన్నత విద్య, ఉచిత వైద్యం అందించటం చంద్రబాబుకు నచ్చటం లేదని విమర్శించారు. జగనన్న పాలనలో 17 మెడికల్ కాలేజీలు తీసుకు వచ్చారని, అయితే కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కాలేజీలు కట్టబెట్టటానికి కుట్రపన్నుతున్నారని ఖండించారు. ప్రజల వద్ద నుంచి కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేసి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. పార్టీ శ్రేణులకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలపై ధైర్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

కుట్రను తిప్పికొట్టాలి: పరిశీలకుడు అవుతు


కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలపై చేస్తున్న కుట్రను పార్టీ శ్రేణులు ప్రజల మద్దతుతో తిప్పికొట్టాలని రాష్ట్ర పార్టీ కార్యదర్శి, పెనమలూరు, మైలవరం నియోజకవర్గాల పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి అన్నారు. చంద్రబాబు తన బినామీల కోసం మెడికల్‌కాలేజీలు బడాబాబులకు కట్టబెట్టే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. జగనన్న తీసుకు వచ్చిన 17 మెడికల్‌కాలేజీలలో ఇప్పటికే ఐదు కాలేజీలు విద్యార్థులకు, ప్రజలకు సేవలు అందిస్తున్నాయన్నారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, నేతలు పి.రాఘవరావు, చాంద్ బాషా, అద్దేపల్లిచందు, సిద్ధిక్, బి.పవిత్ర, కాసాని ఫణి, గుమ్మడి అన్వేష్, అబ్దుల్‌అష్రఫ్, నల్లమోతు జీవన్, యార్లగడ్డ వీరబాబు, వెంకటేశ్వరరావు, సైకం చినబాబు, అనీల్‌రెడ్డి, రచ్చా వెంకటేశ్వరరావు, మొక్కా దిలీప్, కె.సురేష్, ఖాదర్‌బాషా, ముజీబ్ పలువురు పాల్గొన్నారు.



కానూరులో కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న చక్రవర్తి, శ్రీనివాసరెడ్డి, నాయకులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజాపోరాటం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి



అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి

పెనమలూరు: పేద విద్యార్థుల కోసం మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చేస్తున్న యత్నాన్ని ప్రజా పోరాటంతో అడ్డుకుంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణ మూర్తి తెలిపారు. ఆయన కానూరులో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. పేద విద్యార్థులను డాక్టర్‌లుగా చేసి వారి కల సకారం చేయాలని జగనన్న ఎంతో కృషి చేసి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకు వచ్చారన్నారు. అందులో ఐదు కాలేజీలు పూర్తి చేసి తరగతులు ప్రారంభించారని అన్నారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల వలన సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు ప్రజలకు ఉచితంగా అందుతాయన్నారు. అయితే కూటమి సర్కార్ వచ్చిన తరువాత ప్రైవేటు మెడికల్ కాలేజీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పైగా రాష్ట్రంలో ప్రైవేట్‌కాలేజీల నిర్మాణం జరగలేదని సీఎం చంద్రబాబునాయుడు బుకాయిస్తున్నారన్నారు. ప్రజా తిరుగుబాటు రాక ముందే ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపి విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై శ్రద్ధ అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సునంద

గన్నవరం: ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మహిళా సాధికారిత, ఫిర్యాదుల సెల్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై అవగాహనలో భాగంగా అతిథి లెక్చర్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రముఖ ప్రసూతి, స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ సునంద మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని చెప్పారు. మహిళలు శక్తివంతంగా ఉండడం ద్వారానే వారి కుటుంబాలతో పాటు దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. మహిళలు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల మానసిక, ఆరోగ్య పరిరక్షణకు ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్‌వీ.ప్రసాద్ తెలిపారు. మహిళా సాధికారిత, ఫిర్యాదుల సెల్ కోఆర్డినేటర్ ఆర్. భార్గవి పాల్గొన్నారు.

సహనం, ప్రేమ నర్సింగ్ వృత్తికి ప్రధానం



అతిథుల నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న కె.సంధ్యారాణి

గన్నవరం రూరల్: సహనం, ప్రేమ నర్సింగ్ వృత్తికి ఎంతో ప్రధానమని హైదరాబాద్ ఫెర్నాండెజ్ ఫౌండేషన్ హెడ్ ఆఫ్ నర్సింగ్ సర్వీసెస్ సుమని అజయ్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ అండ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాన్యువల్‌డే సెలబ్రేషన్స్ శనివారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.వందన అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుమని అజయ్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందని, నర్సుల సేవలు కోసం ప్రపంచం ఎదురుచూస్తుందన్నారు. రోగులతో సత్సంబంధాలు ఎక్కువగా నర్సులతోనే ఉంటుందని వారికి చిరునవ్వుతో సేవలందించాలని సూచించారు. నేడు వార్షికోత్సవం జరుపుకుంటున్న సిద్ధార్థ స్కూల్ అండ్‌కాలేజ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు చిరునవ్వుతో సేవలందించాలన్నారు. నైటింగేల్ స్ఫూర్తితో రోగులను చూడాలని చెప్పారు. అనంతరం నాలుగు సంవత్సరాల నర్సింగ్ విద్యలో వివిధ విభాగాల్లో ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సిద్ధార్థ అకాడమి కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, నర్సింగ్ కళాశాలల కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్, మెడికల్, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, జె.వందన, కె.కళ్యాణి, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ఏవో టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపులను నియంత్రించాలి



ఐద్వా పతాకాన్ని ఎగురవేస్తున్న సంఘ నాయకులు

గన్నవరం: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం బెల్టుషాపులను నియంత్రించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ముళ్ళపూడి కీర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక చింతపల్లి పాపారావు భవనంలో శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల 16వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా 24 గంటలు మద్యం విక్రయాలు చేస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నపిల్లలపై మానభంగాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్‌వీ.లక్ష్మి, కైలే స్వరూప, మరో ఏడుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొలుత సంఘ పతాకాన్ని సీనియర్ నాయకురాలు మల్లేశ్వరి ఎగురవేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మల్లంపల్లి జయమ్మ, బుద్దవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

500 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో జాతీయ సేవా సమితి, వాసన్ ఐ కేర్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కంటి చూపు ఎంతో ముఖ్యమైందని, వైద్యులను సంప్రదించి ఎప్పటి కప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి చూపులో లోపం రాకుండా ఉండాలంటే విటమిన్స్ ఏ, సి, ఈ గల పోషకాహార పదార్థాలను తీసుకోవాలన్నారు. మొబైల్ వాడకాన్ని నియంత్రించుకోవడం వలన నేత్ర సమస్యలను తగ్గించుకోవచ్చని, ఆ దిశగా విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కళాశాలలో 500 మంది విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు వైద్యపరీక్షలు చేయించుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ తెలియజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నాన్ని ఖండిస్తూ నిరసన

భవానీపురం(విజయవాడపశ్చిమ): సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం గొల్లపూడిలోని అంబేడ్కర్‌నగర్‌లోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, న్యాయవాది అవుల వెంకట్రావు, సంఘం ప్రెసిడెంట్ ఆర్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, ట్రెజరర్ డీ నాగేశ్వరరావు, సీపీఎం కార్మిక నాయకుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టులో కేసులపై విచారణ జరుగుతుండగా జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి యత్నించడం భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిందితుడిని కఠినంగా శిక్షించి న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం కలిగేలా చూడాలని కోరారు. ఒక లాయర్ సీజేఐపై షూ విసర డాన్ని తీవ్రంగా పరిగణించాలని ఆయన అన్నారు. ప్రజల మధ్యచిచ్చుపెట్టి విద్వేషాలను రెచ్చగొట్టేందుకే నిందితుడు ఈ చర్యకు పాల్పడ్డాడని తెలిపారు. కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అండతోనే నకిలీ మద్యం దందా

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు
- విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్ వద్ద సీపీఎం ధర్నా



వైన్ షాపు ముందు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్న బాబూరావు, సత్యబాబు, మహిళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండదండలతోనే నకిలీ మద్యం దందా నడుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ధ్వజమెత్తారు. విజయవాడ విద్యాధరపురం చెరువు సెంటర్‌లో నకిలీ మద్యం అమ్ముతున్న శ్రీనివాస వైన్స్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. సీపీఎం బృందం శ్రీనివాస వైన్స్ దగ్గరకు వచ్చేసరికి మద్యం అమ్మకాలు జరుగుతుండగా వారు లోపలకు వెళ్లి అడ్డుకున్నారు. నకిలీ మద్యం బాటిల్స్‌ను అందిపుచ్చుకుని బయటకు వచ్చి పగులకొట్టి షట్టర్లు మూయించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ మద్యం అమ్మకాల వెనుక పెద్ద మాఫియా ఉందని, దానికి రింగ్ మాస్టర్లు కూటమి ప్రభుత్వ పెద్దలేనని అన్నారు. నకిలీ మద్యం కేసులో కీలకంగా వ్యవహరించిన జయచంద్రారెడ్డికి తంబళ్లపల్లి ఎమ్మెల్యేకి టీడీపీ పక్షాన టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. నకిలీ మద్యం తయారీ, డిస్ట్రిబ్యూషన్ కార్యకలాపాల్లో జయచంద్రారెడ్డి భాగస్వామి జనార్ధనరావుకు ఇక్కడి శ్రీనివాస వైన్స్‌లో వాటా ఉందని, ఇందులో నకిలీ మద్యం అమ్ముతున్నారని ఎక్సైజ్ శాఖ ప్రకటించిన తరువాత కూడా అమ్మకాలు జరుగుతున్నాయంటే ప్రభుత్వ ప్రోత్సాహంతోనేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం అమ్ముతున్న శ్రీనివాస వైన్స్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. స్థానిక ఎక్సైజ్ సీఐని అడిగితే శ్రీనివాస వైన్స్‌కు నోటీసులివ్వాలట.. తరువాత ప్రాసెస్‌కు వారం రోజులు పడుతుందట, అంటే మరో వారం రోజులు ఇక్కడ నకిలీ మద్యం అమ్ముకోమని అనుమతి ఇస్తున్నారా అంటూ ధ్వజమెత్తారు. ఎక్సైజ్, పోలీసులతో కాకుండా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నకిలీ సమస్యను స్థానిక ఎమ్మెల్యేకు తెలియచేద్దామంటే ఆఫీస్ కార్యదర్శికి చెప్పుకోవల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. శ్రీనివాస వైన్స్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఇకపై ఇక్కడ అమ్మకాలు జరగకుండా చూస్తామని భవానీపురం సీఐ, ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, ఐద్వా నాయకురాళ్లు సరోజ, కె వెంకటరత్నం, కె.శేషుమణి, సీఐటీయూ నాయకులు ఈవీ నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, ఎండీ మస్తాన్, ఎస్.కృష్ణ, కె.వరలక్ష్మి, బీ రమాదేవి తదితరుల పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వలేదని ఆటో డ్రైవర్‌పై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాపురం గ్రామానికి చెందిన చొక్కర సాయి మణికంఠ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. మణికంఠ గతంలో వైఎస్సార్ కాలనీలో నివాసం ఉన్న సమయంలో కాలనీకి చెందిన బబ్లు, బన్నీలు పరిచయం. ఆటోలో పాసింజర్స్‌ను ఎక్కించుకుని కాలనీకి వెళ్లినప్పుడల్లా బబ్లు, బన్నీలు మణికంఠను బెదిరించి డబ్బులు అడిగే వారు. అయితే శుక్రవారం రాత్రి కూడా ఆటో వైఎస్సార్ కాలనీకి వెళ్లగా బబ్లు వచ్చి డబ్బులు అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో అక్కడే ఉన్న బన్నీకి సమాచారం అందించి పిలిచాడు. ఇద్దరూ కలిసి సరుగు బాధులతో మణికంఠపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో బాధితుడు అక్కడి నుంచి పారిపోయి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. దాతలు చిన్ని సుబ్బారావు, వేంకట లక్ష్మి, కొత్తమాసు హరిగోపాల్, భారతి సహకారంతో అన్న ప్రసాదం అందించినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి తెలిపారు. దేవాలయంలో స్వామి అమ్మవార్లకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి సేవకు ఉపయోగించిన పుష్పాలతో తయారైన అగరబత్తి, వీభూధి, సబ్బులను దేవాలయం స్టాల్‌లో విక్రయించారు.